క్లుప్తంగా

మామిడికి మద్దతు ధర

చిట్వేలి : మామిడి కేజీకి రూ.4లు చొప్పున మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. బుధవారం రాజుకుంటలో ఏఓ సుధాకర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడికి రూ .4లు చొప్పున మద్దతు ధర చెల్లించి అందరి రైతుల నుంచి మామిడి తీసుకోవడానికి ఉద్యానశాఖ చర్యలు తీసుకోనుందన్నారు. రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న వీఏఏ, వీహెచ్ఏల వద్ద 1బీ, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ సబ్మిట్ చేసి పర్మిట్ తీసుకోవాలని ఏఓ సుధాకర్ సూచించారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

సుండుపల్లె : వర్షాకాలం మొదలైనందున పారిశుద్ధ్య చర్యలు గ్రామాల్లో చేపట్టాలని ఎంపీపీ రాజమ్మ అధికారులకు సూచించారు. బుధవారం ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మహబూబ్‌బాషా మాట్లాడుతూ మండలంలోని రైతులందరికీ 40 శాతం సబ్సిడీతో ఈ ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తనకాయలను ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే పలు శాఖల అధికారులు వారి శాఖలలో ఉన్న ప్రగతి నివేదికలను ప్రజాప్రతినిధులకు తెలిపారు. కొన్ని శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డమ్మ, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

ధృవపత్రాలు లేకుంటే జరిమానా

నందలూరు : ఆటో డ్రైవర్లు తమ వాహనాలకు సంబంధించిన లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, రోడ్ ట్యాక్స్ తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా తమకు ఏర్పాటు చేసిన స్టాండ్‌లోనే నిలబెట్టాలని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆటోడ్రైవర్లపై ఉందన్నారు. తనిఖీల సమయంలో రికార్డ్స్ లేకపోతే జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

డిప్యూటీ డీఈఓగా బాధ్యతలు


కొండూరు రఘునాథరాజు

రాజంపేట టౌన్ : రాజంపేట ఎంఈఓగా పనిచేస్తున్న కొండూరు రఘునాథరాజు డిప్యూటీ డీఈఓగా కూడా బాధ్యతలు చేపట్టనున్నారు. రఘునాథరాజును పూర్తి అదనపు బాధ్యతలతో డిప్యూటీ డీఈఓగా నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని రఘునాథరాజు బుధవారం తెలిపారు. కాగా గతంలో డిప్యూటీ డీఈఓగా పనిచేసిన శివప్రకాష్ పదవీ విరమణ పొందారు.

గాలివీడు ఎంపీడీఓగా చంద్ర

గాలివీడు : మండల ఎంపీడీఓగా కె.చంద్రమౌళీశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన జవహర్ బాబు బదిలీపై వీరబల్లెకు వెళ్లగా ఆయన స్థానంలో వీరు బాధ్యతలు చేపట్టారు. ఈయన లక్కిరెడ్డిపల్లి మండలంలో ఏఓగా బాధ్యతలు నిర్వహిస్తూ ఎఫ్ఏసీపై గాలివీడు ఎంపీడీఓగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు కార్యాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నిత్యం మండల ప్రజలకు అందుబాటులో వుంటూ అధికారుల సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌గా..


శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌గా రమేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో చిన్నమండెం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తూ బదిలీపై లక్కిరెడ్డిపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను సత్ప్రవర్తనతో ఉండేలా చూస్తామని, పదోతరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామ్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శివశంకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, నాగయ్య, రాజశేఖర్, రామ్మోహన్, జమ్రుద్బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోలార్‌తో విద్యుత్ ఆదా


సోలార్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వీరబల్లి : సోలార్ వాడకంతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ నాగమణి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సోలార్ ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్‌ను ఆదా చేయవచ్చన్నారు. రూ.78 వేలు విలువైన సోలార్‌ను నిర్మించడం వల్ల విద్యుత్‌ను ఆదా చేయవచ్చన్నారు. రూ.30 వేలు కేంద్ర ప్రభుత్వం , రూ.20 వేలు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఇస్తుందని, మిగిలిన రూ.28 వేలు బ్యాంకులు ద్వారా రుణం పొందవచ్చన్నారు.

ఏడాదంతా పెట్టుబడి.. మిగిల్చింది కంటతడి!

- ధరలు లేక తోటల్లోనే రాలిపోతున్న మామిడి పండ్లు
- మునుపెన్నడూ ఇలాంటి దుస్థితి చూడలేదంటూ రైతుల ఆవేదన
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ రైతుల వేడుకోలు


ధరలు లేకపోవడంతో తోటల్లోనే వదిలేసిన మామిడికాయలను చూపుతున్న రైతు


తోటల్లోనే మాగిపోయి, రాలిపోయి దర్శనమిస్తున్న మామిడి పండ్లు

లక్కిరెడ్డిపల్లి : ఈ ప్రాంత రైతాంగం మామిడి పంటపై మక్కువతో మండలంలో వందల ఎకరాల్లో సాగు చేశారు. ప్రభుత్వాలు ఉపాధి శాఖ ద్వారా చిన్న, సన్నకారు రైతులకు మామిడి చెట్లు నాటుకునే అవకాశం కల్పించడం పరిపాటిగా మారింది. దీంతో గతంలో మామిడి తోటలపైనే ఆధారపడి సాగు చేసుకున్న వారి పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. అందులో భాగంగానే ఈ ఏడాది మామిడి రైతును నిండా ముంచేసింది. అన్నమయ్య జిల్లాలో 37 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు అవ్వగా రాయచోటి నియోజకవర్గంలో దాదాపు 2 వేల హెక్టార్లలో మామిడి సాగు చేసుకున్నారు. ఏడాది మొదట్లో వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, పూతలు ఆలస్యంగా రావడంతోపాటు చీడపీడలు అధికమై పంట దిగుబడి అంతంత మాత్రమే వచ్చి ప్రస్తుతం బెనీషా రకం కూడా మార్కెట్‌లో టన్ను రూ.10 వేలు నుంచి 15 వేలు లోపు ఉండటంతో రైతులు తీవ్ర నష్టాలపాలయ్యారు. ప్రభుత్వం మేలు రకం జ్యూస్ కాయలు బెంగళూరు రకానికి కిలోకు నాలుగు రూపాయలు అదనంగా ఇచ్చినా మార్కెట్ ధర అధ్వానంగా ఉండటంతో మామిడి కాయలు తోట్లలోనే వదిలేయాల్సిన దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. నాటురకం కాయలు మార్కెట్‌లో అడిగే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజన్ ముగిసిపోయిన నేపథ్యంలో మామిడి తోటల్లోనే కాయలు, పండ్లు రాలిపోయి ఎక్కడికక్కడ దర్శనమిస్తున్నాయి. మామిడి పండ్లు నేల రాలిపోయినవి మార్కెట్‌లోకి తీసుకెళ్తే కొనే నాథుడు లేడంటూ రైతులు వాపోతున్నారు. ఇంత అధ్వాన పరిస్థితులు మునుపెన్నడూ చూడలేదని రైతులు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వాలలో మామిడిని పక్క రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేసుకునే అవకాశం ఉండటంతో ధరలు కూడా ఆశాజనకంగా ఉండేవని, ప్రస్తుతం ఆ పరిస్థితులు లేకపోవడంతోనే మామిడి రైతులను ముంచేసిందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం మామిడి రైతుకు అనాపైసా కూడా ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో రైతు పూర్తిగా నష్టాలు చవి చూడాల్సిన దుస్థితి నెలకొందని పలువురు రైతు సంఘం నాయకులు తెలియజేస్తున్నారు.

ఐదు ఎకరాల మామిడి పండ్లు నేలపాలు



నాకున్న ఐదు ఎకరాల పొలంలో మామిడి సాగు చేసి పది సంవత్సరాలు అయ్యింది. ఈ ఏడాది పంట ఖర్చులు రూపేనా అయినా వస్తాదని ఆశతో ఉన్నాను. మార్కెట్‌లో ధరలు లేక పండ్లు రాలిపోయి తోటలోనే దర్శనమిస్తున్నాయి. పెట్టుబడి అయినా వస్తుందేమోనని రోజూ హైదరాబాదుకు బస్సులలో వేసి పంపుతున్నాను. ఇంత అధ్వాన దుస్థితి మునుపెన్నడూ చూడలేదు. మామిడి రైతును ప్రభుత్వం పట్టించుకోలేదు.

– శివశంకర్ రెడ్డి, రైతు, గుడ్లవారిపల్లి, లక్కిరెడ్డిపల్లి మండలం

కాయలు రాలి కుళ్లిపోతున్నాయి



మామిడి తోటల్లోనే పండ్లు రాలిపోయి ఉన్నాయి. వ్యాపారస్తులు అడిగే వారు లేకపోవడంతో మామిడి కాయలను తోటల్లోనే వదిలేశాం. పంటకోత సమయం ముగియడంతో కాయకు పురుగులు పట్టాయి. మాగిన పండ్లు తినే పరిస్థితి లేదు. ప్రభుత్వం మామిడి రైతును పట్టించుకుని పరిహారం అందించాలి. అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి నెలకొంది.

– నాగయ్య. మామిడి రైతు, మద్దిరేవుల గ్రామం, లక్కిరెడ్డిపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



జూన్ మాసం ముగుస్తున్నా మామిడి తోటల్లోనే ఇంకా కాయలు ఉన్నాయంటూ రైతులు నా దృష్టికి తీసుకువచ్చారు. పూత ఆలస్యంతో కాపు కూడా జూన్ మాసం వరకు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉద్యానశాఖ పరిస్థితిపై మామిడి రైతులు స్థితిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాను. మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన సమయం ప్రారంభమైంది. రైతులు తోటల్లో కలుపు నివారణ చర్యలు చేపట్టాలి.

– సింధూరి, ఉద్యానశాఖ అధికారిణి, లక్కిరెడ్డిపల్లి మండలం

బోధనలో నూతనత్వంతో నాణ్యమైన విద్య

సంబేపల్లె : వినూత్న పద్ధతులతో బోధన చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్య విద్య లభిస్తుందని డైట్ ప్రిన్సిపల్ అజయ్‌బాబు పేర్కొన్నారు. బుధవారం మోటకట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోటకట్ల పాఠశాలను డైట్ పరిశోధనా పాఠశాలగా తీసుకొని విద్యార్థులలో గుణాత్మక విద్యను పెంపొందిస్తామన్నారు. ఇందుకోసం ఆధునిక బోధనా పద్ధతులను ఇక్కడ అమలు చేయడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించే సమయంలో నేర్చుకోవాల్సిన తరగతి గదులలో అమలు చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డైట్ లెక్చరర్ నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, డైట్ అధ్యాపకులు శివభాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ



రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ ముఖ్య నాయకుడు బేపారి బషీర్‌ఖాన్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి బుధవారం ఆయన్ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని దేవుణ్ణి ప్రార్థించారు. బషీర్‌ఖాన్ కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పారు.

రాజన్న, జగనన్న పాలన ఒక స్వర్ణయుగం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి

గాలివీడు : రాజన్న, జగనన్న పాలన రాష్ట్రంలో స్వర్ణయుగంగా సాగిందని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి అన్నారు. ఆయన బుధవారం నూలివీడులో విలేకరులతో మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిల పాలనలో రాష్ట్రంలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదరికాన్ని రూపుమాపిన ఘనత తండ్రి, తనయులదేనన్నారు. దేశం మొత్తం ఆంధ్ర రాష్ట్రం వైపు చూసే విధంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతన్నల గోడు వినేవారే లేరన్నారు. ఎక్కడ చూసినా కూరగాయల పంటలు, పండ్ల తోటలు, వేరుశనగ ధరలు లేక రైతులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్ర రైతులపై ప్రత్యేక దృష్టి పెట్టి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగనన్న పాలనలో ఏ పంట నష్టపోయినా వ్యవసాయ అధికారులు అంచనా వేసి నష్టపరిహారం రైతులకు అందించేవారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ డీఓపీ జిల్లా సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ ఉమాపతి రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషన్ రెడ్డి, పార్టీ కన్వీనర్ యదుభూషన్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

రాజంపేట టౌన్ : విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటం సాగిస్తుందని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరసింహ తెలిపారు. రాజంపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభల పోస్టర్‌లను సర్వేపల్లి నరసింహ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు కేరళ రాష్ట్రంలోని కోజికోడ్‌లో జరిగే ఆల్ ఇండియా ఎస్ఎఫ్ఐ మహాసభల్లో యూనియన్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలకు రాష్ట్రం నుంచి 104 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. జాతీయోద్యమ స్ఫూర్తి, అమరవీరుల వారసత్వం, అధ్యయనం – పోరాటం అన్న నినాదంతో 1970వ సంవత్సరంలో కేరళ రాష్ట్రం త్రివేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ విద్యార్థుల పక్షాన నిలిచి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఆందోళనలు, పోరాటాలను సైతం సాగిస్తుందని తెలిపారు. దేశంలో 50 లక్షల సభ్యత్వాలు ఉన్న అతిపెద్ద విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అని తెలిపారు. ప్రస్తుతం విద్యారంగంలో కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో కార్పొరేటీకరణ, కాషాయీకరణ, కేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తుందని ఆరోపించారు. చివరికి పాఠ్యపుస్తకాల్లో చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. సోషలిజం, లౌకికవాదం అంశాలను రాజ్యాంగం నుంచి తొలగించే కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మదన్‌మోహన్, అశోక్, నవీన్, రామ్‌చరణ్, మనోజ్, విష్ణు, బాలాజీ, గురుతేజ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలి

రాయచోటి జగదాంబసెంటర్ : శ్రీ చైతన్య, నారాయణ, భాష్యం ఇతర కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమానుల విద్యా వ్యాపారానికి అధికారులు అడ్డుకట్ట వేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల ఫీజు, అడ్మిషన్, డొనేషన్, యూనిఫాం, పాకెట్ మనీ వంటి రకరకాల ఫీజుల పేరుతో కోట్ల రూపాయలు దోపిడీ చేస్తూ విద్యను వ్యాపారంగా కార్పొరేట్ విద్యాసంస్థలు మారుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని ప్రశ్నించిన తమ నాయకులపై పోలీసు వ్యవస్థ అత్యుత్సాహంతో ప్రత్యక్షంగా దాడి చేసి మాచవరం పోలీసస్టేషన్‌కు తరలించడం దుర్మార్గం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలో జరుగుతున్నటువంటి విద్యా దోపిడీని అరికట్టకపోతే ఇలాంటి అక్రమ కేసులు ఎన్ని పెట్టినా కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల ముందే ప్రత్యక్ష ఆందోళనా కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి తప్పనిసరి


ఎల్లయ్యను సన్మానిస్తున్న పెనగలూరు హైస్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది

పెనగలూరు : పదవీ విరమణ అనేది ఉద్యోగంలో ఒక భాగమేనని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. హైస్కూల్‌లో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన పుచ్చకాయల ఎల్లయ్య వీడ్కోలు సమావేశానికి వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 సంవత్సరాలు ఉద్యోగ రీత్యా సేవలందించిన ఎల్లయ్య చాలా సౌమ్యుడిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారని కొనియాడారు. తదుపరి రాష్ట్ర ఎస్టీయూ కన్వీనర్ సుబ్రమణ్యం రాజు మాట్లాడుతూ విద్యార్థులకు, పాఠశాలకు సేవలు అందించడమే కాకుండా ఉపాధ్యాయ సంఘానికి ఎల్లయ్య ఎంతో సేవ చేశారన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు ఎల్లయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రఘునాథ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఆదినారాయణ రెడ్డి, పిల్లి రామకృష్ణ, గోపాల్ రెడ్డి, అశోక్ కుమార్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రెడ్డి, రాఘవరెడ్డి, బచ్చల నరసింహారెడ్డి పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అమలుపరచాలి


ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న డీపీఎం వెంకటమోహన్

చిన్నమండెం : ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాన్ని తప్పక అమలుపరచాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) బి.వెంకటమోహన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను సందర్శించారు. అనంతరం యూనిట్ పరిధిలోని ప్రతి గ్రామంలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. గట్ల వెంబడి కంచె పంటలుగా జొన్న, సజ్జ, మొక్కజొన్న పంటలను వేసుకొని పంటలను పురుగుల నుండి రక్షించుకోవాలని తెలిపారు.

మామిడి మండీల సందర్శన

లక్కిరెడ్డిపల్లి : డివిజన్ పరిధిలోని మామిడి కాయల మండీలను బుధవారం ఉద్యానశాఖ అధికారిణి సింధూరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు తోతాపురి (బెంగుళూరు) రకం మామిడి కాయలను కోసి జ్యూస్ ఫ్యాక్టరీలకు అందించిన వారికి కేజీపై రూ. 8లు మాత్రమే ఇస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కేజీకి రూ.4లు అదనంగా ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందిస్తుందన్నారు.

పోక్సోపై అవగాహన ఉండాలి

సిద్దవటం : మండలంలోని టక్కోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు బుధవారం పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో చట్టం అనేది లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే భారతీయ చట్టం అన్నారు. ఈ చట్టం 2012 నవంబర్ 14న అమలులోకి వచ్చిందన్నారు. చట్టంపై విద్యార్థినులకు తప్పనిసరిగా అవగహన ఉండాలని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. బాలబాలికలపై జరిగే లైంగిక దాడులపై కఠిన చర్యలు ఉంటాయని తెలియజేశారు. బాలికలు స్వేచ్ఛగా జీవించేందుకు పోక్సో చట్టం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

కుప్పంలో మహిళపై దాడి అమానుషం

- రాష్ట్రంలో ప్రశ్నార్థకంగా మహిళా భద్రత
- ముఖ్యమంత్రి పదవికి చంద్రబాబు రాజీనామా చేయాలి
- వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు మిర్యాల సురేఖ, చంద్రలీల డిమాండ్


మాట్లాడుతున్న సురేఖ, చంద్రలీల

రాజంపేట టౌన్ : సొంత నియోజకవర్గంలోని మహిళలకే రక్షణ కల్పించలేకపోతున్నందుకు సీఎం చంద్రబాబునాయుడు తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జ్ మిర్యాల సురేఖ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు చంద్రలీల డిమాండ్ చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో భర్త చేసిన అప్పు తీర్చలేదని శిరీష అనే మహిళను టీడీపీ నాయకులు చెట్టుకు కట్టేసి కొట్టడం దుర్మార్గమన్నారు. హోంమంత్రి అనిత మహిళ అయినప్పటికీ తోటి మహిళకు జరిగిన అవమానంపై స్పందించిన తీరు ఏమాత్రం సబబుగా లేదన్నారు. హోంమంత్రి కేవలం ఫోన్ చేసి పరామర్శించి తన పని అయిపోయిందనట్లు వ్యవహరించడం పేద మహిళల పట్ల ఎంతటి నిర్లక్ష్యం ఉందో ఈ సంఘటన ద్వారా అర్థం అవుతోందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించిపోయాయని, ఇక మహిళలకు భద్రత అన్నది మచ్చుకైనా కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై ఎవరు చెయ్యి వేసినా అదే ఆఖరి రోజు అవుతుందని బీరాలు పలికే చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గంలో తన పార్టీ వారే ఓ ఆడబిడ్డను చెట్టుకు కట్టేసి కొట్టిన వారిని ఏ విధంగా శిక్షిస్తారో ప్రజలకు బాబు బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. మహిళలను ఇబ్బందులు పెడితే తాట తీస్తాననే పవన్ కల్యాణ్ శిరీషను చెట్టుకు కట్టేసి కొట్టిన వారి తాట తీయగలరా? అని ప్రశ్నించారు. కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో జరిగిన ఘటనతో అయినా ప్రభుత్వం కళ్లు తెరిచి మహిళలపై దాడులు, అఘాయిత్యాలను అరికట్టాలని, లేకుంటే రాష్ట్రంలో మహిళలు ప్రశాంతంగా జీవించే పరిస్థితి కూడా ఉండదని తెలియజేశారు.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

సుండుపల్లె : వైఎస్ఆర్‌సీపీ భాగంపల్లి పంచాయతీ ఉపసర్పంచ్ ఆదామ్ ఖాన్ కుమార్తె నిఖా వేడుకలో అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మాచిరెడ్డిగారిపల్లె పంచాయతీ చిన్నబిడికిలో దేవలానాయక్ కుమారుడికి ఇటీవలే వివాహమైన సందర్భంగా వధూవరులను ఆయన ఆశీర్వదించారు. అనంతరం గ్రామంలోని మామిడి రైతులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి రైతులకు ఏడాదికి ఒకసారి వచ్చే పంట మామిడి పంట అని, అరకొర పండిన మామిడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మామిడి రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ గత సంవత్సరంలో బేనీషా రకం మామిడి కాయలకు ఒక టన్నుకు కనిష్టంగా రూ.40 వేల నుంచి గరిష్టంగా రూ.60 వేలు, బెంగళూరు రకం మామిడికాయలకు రూ.30 వేలు, నీలం రకం మామిడికాయలకు రూ.35 వేల ధర అందగా, ఈ ఏడాది బేనీషా రకం ఒక టన్నుకు కనిష్టంగా రూ.16 వేల నుంచి గరిష్టంగా రూ.25 వేలు, బెంగళూరు రూ.4 వేలు, నీలం రకం రూ.15 వేలు అమ్ముతున్నాయని రైతులు ఆయనకు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మామిడికాయల జ్యూస్ ఫ్యాక్టరీలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, అలానే నిల్వ చేయడానికి కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాముయాదవ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

రాజంపేట రూరల్ : మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పిండిబోయిన రాము యాదవ్‌ను ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పరామర్శించారు. పట్టణ శివారులోని నారపరెడ్డిపల్లిలో రాము యాదవ్ సతీమణి ఈశ్వరమ్మ దశదిన కర్మలను బుధవారం నిర్వహించారు. పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి ఈశ్వరమ్మ చిత్రపటం వద్ద ముందుగా నివాళులర్పించారు. ఈశ్వరమ్మకు నివాళులు అర్పించిన వారిలో మున్సిపల్ కౌన్సిలర్‌లు పోలా వెంకటరమణారెడ్డి, పసుపులేటి సుధాకర్, సనిశెట్టి నవీన్‌కుమార్ తదితరులున్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం

ఒంటిమిట్ట : ఖరీఫ్ సీజన్‌లో భూ సారం పెంచేందుకు పచ్చిరొట్ట ఎరువులను వేయాలని మండల వ్యవసాయ అధికారిణి ఎన్.మంజుల రాణి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గంగపేరూరు, ఇబ్రహీమ్‌పేట గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమిలో పచ్చిరొట్ట ఎరువులు కలియ దున్నడం, పశువుల ఎరువులు వేసుకోవడం వలన భూమిలో ట్రైకోడర్మా విరిడి, సుడోమోనాస్ వేసుకోవడం, ఘన జీవామృతం తయారు చేసుకొని భూమిలో వేసుకోవడం ద్వారా నేల సారం పెరిగి దిగుబడి పెరుగుతుందన్నారు. అలాగే వరినారు మడులు తయారీ, నారుమడిలో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు అవగాహన కల్పించారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న పీడీ సత్యనారాయణ

చిన్నమండెం : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని సిబ్బంది తప్పక విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మూడు రోజుల పాటు ప్రతి కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని తప్పక నిర్వహించాలని సూచించారు. అనంతరం పలు సూచనలు, సలహాలను అందజేశారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

లక్కిరెడ్డిపల్లి : విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని జిల్లా ఎస్పీ కార్యాలయ కానిస్టేబుల్ ప్రతాప్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో మాదక ద్రవ్యాలు, మత్తు పానీయాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ పదోతరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు మత్తు పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. కష్టపడి చదువుకుంటే ఉద్యోగ భవిష్యత్తు ఉంటుందని, మత్తుపానీయాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని వారు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, నాగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.